నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 15 మార్చి 2025 | పేజీలు 8

# వీఎస్‌యూ అభివృద్ధికి బలమైన అడుగులు

## గవర్నర్, ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో వైస్ ఛాన్సలర్ భేటీ




విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యూ) మరింత అభివృద్ధి దిశగా ప్రయాణించేందుకు వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు కీలక చర్చలు నిర్వహించారు. ఇటీవల ఏపీ గవర్నర్, విశ్వవిద్యాలయాల అధిపతి సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తిలను మర్యాద పూర్వకంగా కలిశారు. *- వెంకటాచలం :*

## రూ.24 కోట్లతో ప్రభుత్వ వైద్యశాలలో..

# క్రిటికల్ కేర్ యూనిట్

- జులై 30న ప్రజలకు అంకితం చేస్తాం
- ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నెల్లూరు జిల్లాకే తలమానికం
- అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటు
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో 24 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నెల్లూరు జిల్లాకే తలమానిక మన్నారు. అత్యంత ఆధునిక వసతులతో ఏర్పాటు చేస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ ప్రజలకు మేలు చేస్తుందన్నారు. జులై 30వ తేదీ లోపల దీని ని పూర్తి చేసి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, జిల్లా మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా

-మిగతా 2లో







## కన్నుల పండువగా.. ప్రసన్నుడి

# కల్యాణ మహోత్సవం

- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- కొండ బిట్రగుంటలో అంగరంగ వైభవంగా శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు
- ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


**బోగోలు, మేజర్‌న్యూస్ :**

జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన బోగోలు మండలం కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించగా, వేల సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామి వారి కళ్యాణాన్ని కన్నులారా వీక్షించారు. గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.

తొలుత శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ లాంఛనాలతో స్వామి, అమ్మ వార్లకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అశేష భక్తజనంతో కలిసి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవ వేడుకలోని అద్భుతమైన ప్రతి ఘట్టాన్ని కూడా వేద పండితులు భక్తులకు సాక్షాత్కరింపచేయగా, మంత్రి భక్తిశ్రద్ధలతో

-మిగతా 2లో

# ఠాగూర్ పాఠశాలలో.. సరస్వతి పూజ






**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :**

మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ పాఠశాలలో శుక్రవారం సరస్వతిదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు, డైరెక్టర్ కె.దొరస్వామి రెడ్డిల ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి ప్రసాద్ సరస్వతి దేవి చిత్రపటం వద్ద పదవ తరగతి విద్యా ర్థుల హాల్ టికెట్లు ఉంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిహెచ్ రమణారెడ్డి, హెచ్ఎం దొరసామిరెడ్డిలు మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షలకు వెళ్లే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని 9వ తరగతి విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీనివాస కళ్యాణోత్సవానికి సీఎంకు ఆహ్వానం

## పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న వెంకటేశ్వరస్వామి వారికి శనివారం నిర్వహించనున్న కల్యాణోత్సవంలో పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు.. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ ఈవో శ్యామలరావు, జేఈఓ వెంకన్న చౌదరి, బోర్డు మెంబర్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇతర సభ్యులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శనివారం వెంకటపాలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే శ్రీనివాస కళ్యాణోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆహ్వాన పత్రికను సీఎంకు అందజేశారు.


# వీఎస్‌యూ అభివృద్ధికి బలమైన అడుగులు

## గవర్నర్, ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో వైస్ ఛాన్సలర్ భేటీ




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యూ) మరింత అభివృద్ధి దిశగా ప్రయాణించేందుకు వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు కీలక చర్చలు నిర్వహించారు. ఇటీవల ఆయన ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయాల అధిపతి సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యతా అంశాలను చర్చించారు. ఈ భేటీలో విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనలకు మరింత ప్రోత్సాహం, విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. విశ్వవిద్యాలయం పరిపాలనలో పారదర్శకత, నూతన విద్యా విధానాల అమలు, పరిశోధన విస్తరణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని వైస్‌ఛాన్సలర్ వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత కూడా పాల్గొన్నారు. అనంతరం ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తిని కలుసుకున్నారు. నూతన విద్యా విధానాల అమలు, పరిశోధన కార్యకలాపాల విస్తరణ, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు. ప్రొఫెసర్ మధుమూర్తి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇస్తూ, మరింత నూతన మార్గదర్శకాలను సూచించారు. ఈ కీలక భేటీలు వీఎస్‌యూ అభివృద్ధికి కొత్త శకం ప్రారంభించేలా మారనున్నాయి. విద్యార్థులకు అధునాతన వనరులు, పరిశోధన అవకాశాలు అందించేందుకు త్వరలోనే విశ్వవిద్యాలయం నూతన కార్యాచరణతో ముందుకు రానుంది.

## రూ.24 కోట్లతో ప్రభుత్వ వైద్యశాలలో క్రిటికల్ కేర్ యూనిట్



(మొదటి పేజీ తరువాయి)

దీనిని ఘనంగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి ప్రజలందరి ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు డైరెక్టర్లు అబిదా, మొగరాల సురేష్, దార్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# కృతజ్ఞత లేకుండా మాట్లాడటం సరికాదు


- వైఎస్సార్‌సీపీలో స్థాయికి మించి పదవి పొందిన వైనం
- మా పార్టీని, నాయకుడిని విమర్శించే స్థాయి నీకు ఉందా?
- ఇంకొకసారి విమర్శలు చేస్తే సహించేది లేదు
- కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్


**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం పొందిన కనుమూరి రవిచంద్రారెడ్డి ప్రస్తుతం పార్టీ అధికారంలో లేకపోయేసరికి కృతజ్ఞత లేకుండా ఆయన మాట్లాడటం సరికాదని నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ 37వడివిజన్ కార్పోరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరుజిల్లాకు చెందిన కనుమూరి రవిచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీలో నేషనల్ స్పోక్స్‌పర్సన్‌గా నియమితులై ఆతరువాత ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్‌కు చైర్మన్‌గా పదవితో క్యాబినేట్ హోదా కల్పించడం జరిగిందన్నారు. పార్టీలో ఇంతటి గౌరవం ఇస్తే నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలో లేదని ఆయన బీజేపీలో చేరారని చెప్పారు. పార్టీ మారడం తప్పుకాదని అయి



తే వైఎస్సార్‌సీపీలో రవిచంద్రారెడ్డికి ఇచ్చిన గౌరవం, ఆయనకు కల్పించిన సముచిత స్థానం మరచి కృతజ్ఞత లేకుండా వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురించి విమర్శించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వాస్తవంగా రవిచంద్రారెడ్డి గూడూరు నివాసి అని అయనకు అక్కడ కనీసం పట్టుమని పది మంది కూడా లేరని కేవలం అతనికి ఉండేది కుటుంబ సభ్యులేనన్నారు. అంతేకాకుండా స్థానిక కౌన్సిలర్‌గా గెలవలేని పరిస్థితి రవిచంద్రారెడ్డిదని అటువంటి వ్యక్తి తన స్థాయిని మరిచి మాట్లాడటం సరికాదన్నారు. పార్టీని, మా నాయకుడిని విమర్శించే అర్హత నీకు ఉందా రవిచంద్రారెడ్డి అని ప్రశ్నించారు. తన 40ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆయా పార్టీలకు సంబంధించి నాయకులందరూ దాదాపుగా తెలుసని అలాంటింది కనుమూరి రవిచంద్రారెడ్డి ఎవ్వరికి పెద్దగా తెలియకపోయినప్పటికి ఆయనకు క్యాబినేట్ హోదా కలిగిన పదవిని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కల్పించి గౌరవించారన్నారు. చేసిన మేలును మరిచి వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని రవిచంద్రారెడ్డిని హెచ్చరించారు. నీవు మాట్లాడే ప్రతి మాటకు మేము కౌంటర్ ఇస్తామన్నారు. ఇంకోక సారి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని లేని పక్షంలో సరైన సమాధానం చెప్పేందుకు ఎప్పుడూ మేము సిద్దంగా ఉంటామన్నారు.

# కనుల పండుగగా.. ప్రసన్నుడి కళ్యాణ మహోత్సవం





(మొదటి పేజీ తరువాయి)

వీక్షించారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవారిని మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే దర్శించుకున్నారు. తదనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ దేవాదాయ శాఖ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కొండ బిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామిని దేవాదాయ శాఖ మంత్రిగా మూడోసారి దర్శించుకోవడం, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టం, పూర్వజన్మ సుకృతంగా చెప్పారు. కొండ బిట్రగుంట ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, వారికి దేవాదాయ శాఖ తరపున ఆలయ పరిధిలో ఏ అభివృద్ధి కార్యక్రమానికైనా అన్నివిధాల సహకారం అందిస్తామని చెప్పారు. 12.50 కోట్ల రూపాయలతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారని, అన్ని పనులు కూడా టెండర్లు పూర్తయి మొదలవుతున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, ఈవో కార్యాలయం, విశ్రాంతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. తిరుమల తరువాత దక్షిణాదిన కొండ బిట్రగుంట క్షేత్రము అత్యంత ప్రసిద్ధి చెందినదని, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామని మంత్రి చెప్పారు. శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ.. 27 ఏళ్ల క్రితం రూ.2 లక్షలతో శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించామని చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు కూడా ప్రభుత్వాల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కావలి ఎమ్మెల్యేగా క్రిష్ణారెడ్డి ఎన్నికైనప్పటి నుంచి ఆలయ అభివృద్ధికి నిరంతరం ఆలోచన చేస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఆనం రామనారా యణ రెడ్డి సారథ్యంలో ఒక మాస్టర్ ప్లాన్ ప్రకారం ఆలయాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం భగవదనుగ్రహంగా భావిస్తున్న ట్లు బీద రవిచంద్ర చెప్పారు. 2028 బ్రహ్మోత్సవాల నాటికి ఆలయంలో శాశ్వతంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కావలి ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తన గురుతుల్యులు, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం, మొదటిసారిగా ఒక దేవాదాయ శాఖ మంత్రి బిట్రగుంట వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. రూ.1.85 కోట్లతో ఆలయానికి కాంపౌండ్ వాల్, రూ.2.65 కోట్ల టీటీడీ నిధులతో గాలిగోపురం నిర్మాణ పనులు త్వరలోనే మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. కళ్యాణ కట్ట, కళ్యాణ మండపం, అన్నదాన సత్రం నిర్మాణాలు మొదలైన ఆలయ అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున దాతలు ముందుకొస్తున్నారని, వారందరి సహాయ సహకారాలతో, దేవాదాయ శాఖ నిధులతో బిట్రగుంట ఆలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయనున్నట్లు కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఈవో అరవ రాధాకృష్ణ, ఆలయ మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, దేవాదాయ శాఖ అధికారులు, రావి విజయ్ కుమార్ యాదవ్, మాలేపాటి నాగేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డులు, ఫించన్ల కోసం ఎదురుచూపులు

**ప్రభుత్వం నుండి విడుదల కాని ఉత్తర్వులు**

**నిబంధనలు సడలించిఅర్హులందరికీ న్యాయం కోరుతున్న జనాలు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా రేషన్‌కార్డులు, వివిధ రకాల ఫించన్లకు అర్హులైన వారు ప్రభుత్వ ఆదేశాలు, ఉత్తర్వులకోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తులు చేసుకోవాలంటూ సోషల్‌మీడియాలో అప్పుడప్పుడూ కన్పిస్తుందేకానీ ఇంకా ప్రభుత్వం తగిన ఉత్తర్వులివ్వలేదు. అర్హతల నియమావళిని కూడా విడుదల చేయలేదు. అయితే వివిధ పెన్షన్లు, రేషన్ కార్డులు, సంక్షేమ కార్యక్రమాల మంజూరులో అర్హులందరికీ న్యాయం చేయాలని, గతప్రభుత్వంలో ఉన్న నిబంధనలను సడలించాలని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేస్తే ఇబ్బందికరమని కొందరు, కొన్ని నిర్ణయాలు అమలు చేయకుంటే ఇబ్బందికరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. 20సంవత్సరాలకు క్రితం ప్రభుత్వం డిఫారం పట్టాగా రైతులకు ఇచ్చిఉంటే అలాంటివారికి ఫ్రీహోల్డ్ అంటూ వైసిపి ప్రభుత్వం పలువురు రైతులకు ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు పంపిణీ చేశారు. ఈ సర్టిఫికేట్ ద్వారా ఆ భూములను విక్రయించుకోవచ్చుని, రిజిస్టర్ చేసుకోవచ్చుని నిర్ణయించారు. దాదాపు ఏడాది క్రితం ఈ పర్టిఫికేట్లు ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆయా పొలాలకు సంబంధించి గత ఏడాది ఫ్రీహోల్డ్ చేయబడిందని నమోదు చేశారు. కానీ తీరా చూస్తే ఈ నూతన ప్రభుత్వం ఫ్రోహోల్డ్ అంశాన్ని పెండింగ్‌లో ఉంచింది. దాంతో ఆ సర్టిఫికేట్లు పొందిన రైతులు తీవ్ర నిరాశకుగురై ఆవేదన చెందుతున్నారు. తమకు 20 సంవత్సరాలకు ముందు ఇచ్చిన డిఫారం పట్టాలు శాశ్వతపట్టాలుగా మారనున్నాయని సంబరపడ్డ రైతులు దిగాలు చెందిన ఉన్నారు. ప్రభుత్వం ఈవిషయమై పరిశీలించిన కొత్తగా ఇవ్వకున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఫ్రీహోల్డ్ అంటూ సర్టిఫికేట్లు ఇచ్చివారికి చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### ఫించన్లకు గత ప్రభుత్వ నియమాలు పాటించవద్దు

వివిద రకాల పెన్షన్ల కొనసాగింపు, మంజూరుకు గత వైసిపి ప్రభుత్వ నియమాలు అమలుచేయవద్దని, చాలామంది తీవ్రంగా నష్టపోతారని అనేకమంది పెన్షనర్లు, పెన్షన్‌కు అర్హులైనవారు కోరుతున్నారు. గత ప్రభుత్వం దారిద్ర్యరేఖకు దిగువనున్న రైస్‌కార్డు దారులందరూ అర్హులు కాగా విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్లుకన్నా అధికంగా ఉందని, ఇంటికొలతలు అధికంగా ఉన్నాయని, నాలుగుచక్రాల వాహనాలున్నాయని, కుటుంబ సభ్యులు ఆదాయ పన్నులు చెల్లిస్తున్నారంటూ అనేక మందిని అనర్హులుగా చేసి పెన్షన్‌లు రద్దుచేశారు. అర్హులు నూతనంగా దరఖాస్తులు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. దాంతో అందరూ లబోదిబో అంటూ తీవ్ర ఆవేదనకు గురికాగా పెన్షన్లను రద్దుచేసి పలువురికి వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తుందంటూ తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టారు. కాగా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం అదే నియమాలను అమలు చేయనుందని, అనర్హులంటూ పలువరి ఫించన్లకు ముప్పురానుందని, కొత్తగా పెన్షన్ల మంజూరుకు గత నిర్ణయాలు, నియమాలు పాటించనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గత నిర్ణయాలు అమలు ఉంటుందా లేదా, తాజా నిర్ణయాలా అనేది ప్రభుత్వం నుండి సచివాలయాకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదంటున్నారు. ఏదేమైనా అర్హులకు నియమావళి అంటూ రైస్‌కార్డుదారులకు నూతన ఫించన్ల మంజూరు కాకున్నా, ప్రస్తుతం ఉన్న పెన్షన్లు రద్దయినా అనేకమంది నష్టపోయే పరిస్థితి, ఆందోళనకుగురయ్యే పరిస్థితి, అలజడి చెలరేగే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం పునరాలాలోచించి గతంలో తెలుగుదేశం అమలుచేసిన నియమావళినే ప్రాతిపదికన తీసుకోవాలని, వైసిపి నియమాలు అమలుచేయరాదని, సాధారణ, మద్య తరగతి కుటుంబాలవారు కూడా విద్యుత్ 300 యూనిట్లకన్నా అధికారంగా వినియోగించుకునే పరిస్థితి ఉంటుందని, బిడ్డలు చదువుకుంటూ కనీస అవసరాలను వాడుకూటుంటారని, అలాంటివారిని గమనించాలని, ఆంక్షలపేరుతో పెన్షన్లు రద్దుచేయారాదని అనేకమంది కోరుతున్నారు.

### టిడ్కో గృహాలు మంజూరైనవారికి పట్టాలివ్వాలి

గతంలో తెలుగుదేశం ప్రభుత్వహయాంలో నిర్మించిన టిడ్కో గృహాల నిర్మాణాలను పూర్తిచేసి లాటరీ విధానంలో లబ్దిదారులకు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం వాటిని గురించి పట్టించుకొనకుండా ఎన్నికలు సమీపించే పరిస్థితిలో మళ్ళీ గృహాలను కేటాయించారు. అయితే ఆత్మకూరులో చూస్తుంటే 1050 గృహాలు కాగా ఇప్పటివరకు ఐదారువందల మంది అక్కడకు నివాసాలు మార్చుకున్నారు. గతంలో చెప్పిన విధంగా అక్కడ గుడి,చర్చి,మశీదు, పార్కు, స్కూలు, అంగన్‌వాడీ కేంద్రం తదితరాలను ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించారు. పార్కుకు సంబంధించి మెటీరియల్ కూడా అక్కడకు చేర్చారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటి గురించి ఆలోచించిన పాపానపోలేదు. కాగా కొన్ని గృహాలు ఖాళీలుండగా అర్హులు కొందరు దరఖాస్తు చేసుకున్నారు. విఆర్వో, కమీషనర్, ఆర్డీవోల అర్హులుగా ఆమోదించి ఫైనల్‌గా జాయింట్ కలెక్టర్‌కు ప్రాతిపాదించగా అక్కడ కూడా ఆమోదం పొంది గృహాలు మంజూరయ్యాయి. అయితే వారికి పట్టాలిచ్చే సమయానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పట్టాపుస్తకాలపై గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఫోటోలున్నాయని అధికారులు నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆపాస్‌బుక్‌లను మార్చి లబ్దిదారులకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. ఈవిషయమై ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

# జివో117రద్దుతో గ్రామీణ పాఠశాలలు మనుగడ సాధించేనా

**గతంలో విలీనంతోనే హూనం**

**ఆత్మకూరులో రెండుపాఠశాలల్లో సున్న నమోదు**

**తాజాప్రభుత్వ నిర్ణయాలపై కొండంత ఆశలు**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రప్రభుత్వం గతం ప్రభత్వం ఇచ్చిన జివో 117ను రద్దుచేయడంతో ఇకనైనా గ్రామీణ ప్రాంత పాఠశాలల మనుగడ సాగిస్తాయా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. జాతీయవిద్యావిధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం పలు పాఠశాలలను సమీప పాఠశాలల్లో విలీనంచేస్తూ 117 జివో విడుదల చేసి అమలుచేయడంతో అనేక పాఠశాలలు మూతపడడం, పలు పాఠశాలలు 10లోపు విద్యార్థులతో సాగుతుండడం జరుగుతోంది. ఈప్రభుత్వం ఆ జివోను రద్దుచేసి కొత్తగా మాడల్‌స్కూళ్ళు ఏర్పాటు, క్లస్టర్ విధానం అమలు, ప్రాథమికోన్నత పాఠశాలలను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనంచేసేలా నిర్ణయించారు. గతంలో ఉన్నతపాఠశాలల్లో విలీనంచేసిన 3, 4, 5తరగతుల విద్యార్థులను మళ్ళీ ప్రాథమిక పాఠశాలలకే పంపేలా నిర్ణయించారు. దాంతో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు మనుగడ సాగిస్తాయని అందరూ భావిస్తున్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తాం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక దశలోనే పునాదులు వేస్తాం, ఆంగ్లమాధ్యమం ప్రవేశపెడుతున్నాం, చిన్నారులందరినీ సర్కారుబడులకు రప్పిస్తాం, అమ్మఒడి, మధ్యాహ్నం భోజనం, విద్యాదీవెన, విద్యాకానుక, యూనిఫారం దుస్తులు, బూట్లు,టైలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇస్తాం అంటూ ఎన్నెన్నో ప్రయోగాలను వైసిపి ప్రభుత్వం అమలుచేసినా తీరా చూస్తుంటే ఏఏటికాఏడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. తల్లిదండ్రులు కాన్వెంట్లపై మోజు పెంచుకుంటున్నారు. ఆత్మకూరు మండలంలో గత 2విద్యాసంవత్సరాలు, ఈ విద్యాసంవతర్సరం పరిశీలిస్తే విద్యార్థుల సంఖ్య పెరగకపోగా తగ్గిపోయింది. గత ప్రభుత్వ హయాంలో తరగతుల విలీనం, కొత్తతరగతుల ఏర్పాటు తదితర కారణాలతో విద్యావ్యవస్థ అస్థవ్యస్థంగా మారింది. తాజా తెలుగుదేశం ప్రభుత్వం ప్లస్‌టు రద్దు, తరగతుల విలీనం రద్దు తదితర నిర్ణయాలను తీసుకుంటుండడంతో ఇకనైనా విద్యావ్యవస్థ గాడినపడుతుందా అని జనాలు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఈ విద్యాసంవత్సరం పరిశీలిస్తే ఉన్నతపాఠశాలలు 13, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 63 ప్రభుత్వపరంగా ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం ఆరంభమై అడ్మిషన్లు పూర్తయ్యాక పరిశీలించగా ఈ76పాఠశాలల్లో 1నుండి 10తరగతుల విద్యార్థుల సంఖ్య 4483గా ఉండగా 13 ఉన్నత పాఠశాలల్లో 2817మంది విద్యార్థులు కాగా మిగతా 63 ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1664మంది మండలంలో మాత్రమే ఉన్నారు. సగటున ఒక పాఠశాలకు 26.4మంది ఉన్నారు. మండలంలోని రావులకొల్లు, ఆరవేడుజంగాలపల్లి, అల్లీపురం పాఠశాలల్లో విద్యార్థులు గతంలో ఉన్నవారు వెళ్ళిపోగా ఈదపా సున్న నమోదు కావడంతో ఆపాఠశాలలు మూతపడ్డాయి. మండలంలోని 10మందికన్నా విద్యార్థులు తక్కువగా 9పాఠశాలలు, 25మందికన్నా తక్కువగా 22పాఠశాలలున్నాయి. సాతానుపల్లి పాఠశాలలో 6మంది, చెర్లోయడవల్లి పాఠశాలలో 8మంది, మురుగుళ్ళమెయిన్ పాఠశాలలో నలుగురు, అప్పారావుపాళెం ఈస్ట్ ఎస్‌సి పాఠశాలలో 7మంది, ఆత్మకూరు ఈస్ట్ పాఠశాలలో 10మంది, ఎల్ఆర్‌పల్లి ఉర్దుపాఠశాలలో ముగ్గురు, ఎల్ఆర్‌పల్లి మెయిన్ పాఠశాలలో 6మంది, వాసిలి ఎస్‌సి పాఠశాలలో 5మంది, పేరారెడ్డిపల్లి ఎస్టీ పాఠశాలలో 7మంది, రావులకొల్లు పాఠశాలలో ముగ్గురు మాత్రమే విద్యార్థులుండడంతో ఈ పాఠశాలల మనుగడ ప్రశ్నార్ధకంగా మారింది. ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి ఉర్ధుపాఠశాలలో 2021-22లో ఒక్క విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడు, 2022-23లో నలుగురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఈదపా ముగ్గరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు, ఒక స్వీపర్‌కూడా పనిచేస్తుండగా ఈపాఠశాలకు రెండు పక్కా భవనాలుండగా రిపేర్లు, బాత్‌రూముల నిర్మాణాన్ని ప్రభుత్వం 12లక్షల రూపాయలుతో చేసింది. రావులకొల్లులో గత ఏడాది ఐదుమంది, ఈదపా ముగ్గరు విద్యార్థులు కాగా రెండు భవనాలుండగా మళ్ళీ 17లక్షల రూపాయలతో భవనాలు నిర్మించారు. నాడు-నేడు అంటూ అవసరం ఉన్నాలేకున్నా లక్షలాదిరూపాయలు వెచ్చించడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో ఈపరిస్థితి ఏర్పడింది. వ్యవస్థ అస్థవ్యస్థంగా మారింది. మొన్నటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేకచట్టాలు తేవడం, అనేక యాప్‌లు ప్రవేశపెట్టడం, అనేక పథకాలు అమలు చేయడం అందరికీ తెల్సిందే. దాంతో వ్యవస్థ బాగా దెబ్బతిన్నదని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిణామాలతో అనేకమంది తల్లిదండ్రులు తమ బిడ్డలను వ్యవప్రయాసలతో ప్రవేటు స్కూళ్ళలో చేర్చుతున్నారు. ఇక 14సంవత్సరాల లోపు చిన్నారులు బడి బయట ఉండరాదని, అనేక చట్టాలు అమలు చేస్తున్నా చిత్తుకాగితులు సేకరించడం, ఇతరత్రా పనుల్లో నిత్యంత బయట డ్రాపవుట్స్‌గా కన్పిస్తున్నారు. ఆత్మకూరు మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 76కాగా 2021-22లో 5503మంది విద్యార్థులు కాగా 2022-23లో 5126 మందిగా, ఈదపా 4481మంది విద్యార్థులున్నారు. ఏటా ఎన్నెన్నో కోట్ల రూపాయలతో అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్న ప్రయోగాలు చేస్తున్నా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉండగా ఒక్క ఆత్మకూరు మండలంలోనే రెండు పాఠశాలల్లో సున్ననమోదు, 10మందికన్నా విద్యార్థులన్న పాఠశాలలు 10కాగా 25మందికన్నా తక్కువగా 22పాఠశాలలుండడం గమనార్హం, ముగ్గరు, నలుగురు, ఐదుమంది విద్యార్థులన్నచోట వారు ఖచ్చితంగా ఆ పాఠశాలలో చదివేవారేనా, పాఠశాల ఉనికికోసం ఒకటి,రెండు పేర్లు తూతూమంత్రంగా నమోదుచేశారా అనే సందేహంకూడా ఉంది. పలు ప్రాథమిక పాఠశాలల్లో నుండి 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీప ఉన్నత పాఠశాలలకు పంపినా అక్కడ వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదు. ఉన్నత పాఠశాలలో జూనియర్‌కాలేజి అని ప్రకటించిన ప్రభుత్వం ఆత్మకూరులో రెండేళ్ళ క్రితం ఒక మహిళాజూనియర్‌కాలేజిని ప్రారంభించి ఒక్కరినీకూడా సిబ్బందిని, అధ్యాపకులను నియమించనందున ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే బోధించగా పరిక్షల్లో ఈకాలేజిలో అత్యధికంగా విద్యార్థినిలు ఇంటర్‌లో ఫెయిల్‌కాగా ప్రభుత్వం తమ ప్రయోగం విఫలమైందని భావించి కాలేజిని మూసివేశారు. ఈనూతన ప్రభుత్వం గత చట్టాలను మార్చి అస్థవ్యస్థంగా మారిన విద్యావ్యవస్థను సక్రమబాటలోకి తేవాలని, విద్యార్థులు అధికంగా కోట్లాదిరూపాయలు వెచ్చించే ప్రభుత్వపాఠశాలల్లో చేరేలా చూడాలని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల పౌష్టికాహారంపట్ల చైతన్యం తేవాలి

## శిక్షణాతరగతుల్లో సిడిపివో సునీలత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** చిన్నారులకు పౌష్టికాహారాన్ని తగినంతగా అందించి వారు ఆరోగ్యవంతంగా ఉండేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముమ్మరంగా గృహసందర్శనలు నిర్వహించి మహిళలకు తగిన అవగాహన కల్పించి చైతన్యం తేవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత కోరారు. ఆత్మకూరు పట్టణంలోని ఈస్ట్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన అంగన్‌వాడీ కార్యకర్తల 3రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మూడవరోజు ముగింపు సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. సమాజంలోని చిన్నారుల పోషణస్థాయి పెంచడమే లక్ష్యంగా పోషణ్-బి, పడాయి-బి కార్యక్రమాలు ప్రభుత్వం ప్రారంభించిందని, లక్ష్యసాధనకు అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయాలని, 6సంవత్సరాలలోపు చిన్నారుల పోషణ లక్ష్యంగా 2023మేలో కేంద్రమంత్రి స్మృతిఇరాని ప్రారంభించారన్నారు. ఈపథకంద్వారా 0-3సంవత్సరాల చిన్నారులకు నవచేతన్ కార్యక్రమం, 3-6సంవత్సరాల చిన్నారులకు ఆధార్‌శీలా కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించిందని, ఈ కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేకశ్రద్ధతో వ్యవహరించి చిన్నారుల్లో పోషణ లోపం లేకుండేలా చర్యలు తీసుకోవాలని సునీలత పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలో గృహసందర్శనలు ముమ్మరంగా నిర్వహించాలని, చిన్నారుల తల్లులకు పోషణ గురించి అవగాహన కల్పించాలని, చిన్నారులు పరిపుష్టిగా ఆరోగ్యవంతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తూ తగిన అవగాహన పెంపొందించాలని, తల్లిపాలలోని విశిష్టతను అందరికీ తెలియజేయాలని, ప్రభుత్వం అందించే పౌష్టాకాహారాన్ని సద్వినియోగంచేసుకునేలా అందరికీ అవగాహన కల్పించాలని ఆమె పేర్కొన్నారు. అందుకుగాను గృహసందర్శనాలు, అవగాహనా సదస్సులు కూడా ముమ్మరంగా నిర్వహించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన నియమాల గురించి వివరించాలని ఆమె సూచించారు. చిన్నారుల ఎత్తు, అందుకుతగిన బరువు, ఎదుగుదలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆధార్‌షీలా కార్యక్రమం ద్వారా 3-6 మధ్య వయసున్న చిన్నారుల ఆరోగ్యం, బాషాభివృద్ధి తదితర ఐదు అంశాలపట్ల అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల పోషణకోసం అందించే బాలామృతంను పిల్లలకు సక్రమంగా వినియోగించేలా తల్లులకు అవగాహన కల్పించాలని సిడిపివో సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ముమ్మరంగా గృహసందర్శనాలు నిర్వహించాలని, తల్లులకు అవగాహన కల్పించి చైతన్యపరచాలని సునీలత పిలుపునిచ్చారు. ఈ అంశాల గురించి శుక్ర, శనివారాల్లో కూడా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు. చిన్నారుల్లో ఎలాంటి సమస్యలు లేకుండేలా, ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, వివిధ రకాల పోషకాహారాలను సరఫరాచేస్తుందని, అందువలన అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పకుండా ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలని సునీలత కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎం.రత్నమ్మ, ఎన్.కేశవనారాయణమ్మ, ఆత్మకూరు రూరల్ పరిధిలోని వాసిలి, దేపూరు సెక్టారుకు చెందిన 47మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకం






**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వేంచేసియున్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం నాడు లక్ష్మి జయంతి సందర్భంగా లక్ష్మి నరసింహ స్వామి వారికి, ఆదిలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకం, శఆదిలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మంగళహారతి, పూర్ణాహుతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, కల్యాణోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రధాన అర్చకులు భాస్కరా చార్యులు వైధిక పర్యవేక్షణలో, కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఆద్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి. ఉభయ కర్తలుగా అనిల్ కుమార్ జోషి, ప్రతిభా జోషి, సాగిరాజు వెంకట రాజు, సునీత దంపతులు, వారి కుమారుడు శశాంక్ దత్‌లు వ్యవహరించగా అదేవిధంగా పౌర్ణమి తిధి సందర్భంగా గరుడసేవ గిరి ప్రదక్షిణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా పి.ఆనంద్‌కుమార్ వ్యవహరించగా కళ్యాణ ఉత్సవంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత, మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి, రుత్వికులు, అర్చక సిబ్బంది, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామి వారికి కానుకగా గొడుగులు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలో కొలువుదీరి యున్న శ్రీ తల్పగిరి రంగనాధ స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం రాత్రి శ్రీవారి గొడుగుల సేవ జరిగింది. శ్రీ కృష్ణ చరిత మానస ప్రచార మండలి సభ్యులు నూతన గొడుగులతో నవాబుపేట, మైపాడు గేటు ఆంజినేయస్వామి సన్నిధి నుంచి మంగళవాయిధ్యాలు, భక్తిగీతాలతో గొడుగులను ఊరేగింపుతో తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంకు జిల్లా దేవాదాయ అధికారి, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాస రావు, ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

## జనసేన జయకేతనం సభ ఎల్‌ఈడి లైవ్ ఏర్పాట్లు

### పంచాయతీ బస్టాండులో కేకు కట్ చేసిన జనసైనికులు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణ అధ్యక్షులు దసినేటి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పంచాయతీ బస్టాండులో పిఠాపురంలో జయకేతనం పేరిట నిర్వహిస్తున్న సభకు సంభందించి ఎల్‌ఈడి ద్వారా లైవ్ ఏర్పాట్లు సిద్దం చేశారు. ఈ సందర్భంగా జనసేనికుడు విష్ణు మాట్లాడుతూ.. జనసేన పార్టీ ఇవాళ 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటోంది. 2014లో ప్రస్థానం ఆవిర్భవించిన జనసేన పార్టీని అధినేత పవన్ కళ్యాణ్ ఈ 12 ఏళ్ల ప్రస్థానంలో బలమైన శక్తిగా నిలబెట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన సాధించిన 100 శాతం స్ట్రైక్ రేట్ విజయం చరిత్రలో నిలిచిపోతోందని ఈ నేపథ్యంలో ఇవాళ పిఠాపురంలో ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలు భారీ ఎత్తున నిర్వహిస్తోంది కనుక సభ లైవ్ ఏర్పాటు చేసి కేకు కట్ చేసి సంబరాలు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జనసేనపార్టీకి, జనసైనికులకు శుభాకాంక్షలు చెబుతూ కార్యక్రమంలో విష్ణు, ఆనంద్, చిన్నయ్య, బాబ్జీ, రోహిత్, యశ్వంత్, విజయ్, శశి తదితరులు పాల్గొన్నారు.

## నేడు టౌన్ బస్సు ప్రారంభం

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నేడు శనివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు ఒన్ డిపో ఆర్‌టీసి బస్టాండ్ నుండి బస్సు నూతనంగా ప్రారంభిస్తున్నారు. ఈ బస్సు వెంకటేశ్వరపురం మీదుగా కోవూరు మండలం పడుగుపాడు వరకు తిరిగి కొత్తూరు అంబాపురం (టిడ్కో) ఇల్లు వున్న ప్రాంతం వరకు బస్సు వేస్తున్నారు. ఈ విషయం ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ శ్రీ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలియ జేశారు. మన మండలానికి ఈ బస్సు సౌకర్యం కల్పించినందుకు ఆర్‌టిసి రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## బీసీ కులాల చేతి వృత్తి పని వాళ్లకు సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో గల స్త్రీ శక్తి భవనం నందు శనివారం బీసీ కులాల వాళ్లకు సమావేశం నిర్వహించబడుతుందని ఎంపీడీవో అప్పాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంకు మేదరచా కలి మంగలి కంసలి తదితర చేతివృత్తుల వారికి సమావేశం నిర్వహించి 2025-26 సంవత్సరంకు గాను ఆదరణ కింద అవసరమగు పనిముట్లు గురించి చర్చించి ఆ వివరాలను ప్రభుత్వంకు పంపడం జరుగుతుందని సమావేశంకు దరఖాస్తుదారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## ఎల్‌ఆర్‌పల్లి పార్కును బాగుచేయాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ఎల్.ఆర్.పల్లిలో ఉన్న ఎస్‌ఎంకె పార్కును బాగుచేయాలని సిపిఎం నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, కమీషనర్ సి.గంగాప్రసాద్‌లకు వినతిపత్రాలు అందజేశారు. అనాదిగా ఈ పార్కులో చిన్నారులు, యువత ఆటలాడుకుంటుండేవారని, వయోవృద్ధులు వాకింగ్ చేస్తుండేవారని వారు పేర్కొన్నారు. కొంతకాలంగా ఈ పార్కు ముళ్ళచెట్లతో నిండుకొని నిరుపయోగంగా ఉందని వారు వివరించారు. ఆర్డీవో, తహశిల్దారు, ఎంఎవో కార్యాలయాలు, ఉన్నత, ప్రాధమిక పాఠశాల, కోర్టు, పోలీస్‌స్టేషన్, సిఐ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్‌ట్రెజరి తదితర కార్యాలయాల మధ్య ఉన్న ఈపార్కు కంపచెట్లతో నిండుకొని నిరుపయోగంగా ఉండడం బాధాకరంగా ఉందని, వెంటనే బాగుచేయాలని, అలా చేయకుండా ప్రజాందోళనకు దిగుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఎం అధ్యక్షుడు కె.డేవిడ్‌రాజు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ షేక్ సందాని, రైతుసంఘ అధ్యక్షుడు పి.కృష్ణమోహన్, పలువురు సిపిఎం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి రాహుకాల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం మధ్యాహ్నం ఫాల్గున పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విశేషముగా పాల్గొని రాహుకాల దీపాలు వెలిగించి 18 వారాలు తదుపరి 19 వ వారము 69 మంది భక్తులు రాహుకాల ఉద్యాపన పూజ కార్యక్రమంలో పాల్గొని శ్రీ అమ్మవారికి 108 నిమ్మకాయల మాల, చీర, జాకెట్టు, పసుపు కుంకుమ సమర్పించి అమ్మవారిని దర్శించి ఉచిత ప్రసాద వినియోగ పొంగలి స్వీకరించడం జరిగింది. అనంతరం సాయంత్రం 6.00 గంటలకు వేద పారాయణం 6.30 గంటలకు సంధ్యా మేళం 7.00 నుంచి పౌర్ణమి సందర్భంగా సామూహిక లలిత సహస్రనామార్చన పారాయణం, 7.30 గంటలకు కుంభ హారతులు, 8.00 గంటలకు పల్లకి సేవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, అర్చకులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతిమయాత్ర వాహనం ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా రామ్మూర్తి నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు పుండ్ల వేంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ జ్ఞాపకార్థం అంతిమయాత్ర వాహనాన్ని, బీజేపీ జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాల ప్రకారం అంతిమయాత్ర అనేది జీవితంలోని చివరి ఘట్టం అనీ, ఇది ఒక పవిత్రమైన, ఆధ్యాత్మికంగా ప్రాముఖ్యత గలదని, మరణించిన వారి గౌరవాన్ని పరిరక్షిస్తూ, నిరుపేద కుటుంబాలకు తగిన సహాయాన్ని అందించేందుకు 'పట్టణ ప్రజలు ఉచితంగా టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి 9182735449 ఉపయోగించుకోవచ్చు అన్నారు. ఈ ట్రస్టు ద్వారా పేదలకు గత 20 సంవత్సరాలు నుండి మంచినీరు అలాగే పేద విద్యార్థులకు స్కూళ్లు ఫీజులు అందిస్తున్న పుండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌ని అభినందించారు.




ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, గడ్డం విజయ్ కుమార్, యారబోలు రాజేష్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరి కుమార్ గౌడ్, ఆఫీస్ సెక్రటరీ కుప్పా ప్రసన్న, మండలాధ్యక్షులు మింగాకిరణ్, చిత్తాతూరు పద్మావతి, వెంగల్ రెడ్డి, మదన్ సాయి రెడ్డి, రాములు, దొర, సురేష్, కిరణ్, అవినాష్, జిల్లా నాయకులు, ట్రస్ట్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంపసముద్రంలో విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం కంపసముద్రం హైస్కూలు నందు పదవ తరగతి విద్యార్థులకు కీర్తి శేషులు మల్లు రమణారెడ్డి జ్ఞాపకార్థం మల్లు రమణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లు వెంకటేశ్వర్లురెడ్డి, వారి కోడలు నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అంగన్వాడీ అధ్యక్షురాలు మల్లు స్వాతిరెడ్డి ఆధ్వర్యంలో పదవతరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ప్యాడ్ పెన్నులు, పెన్సిల్స్, భవిష్యత్తులో సర్టిఫికెట్‌లు భద్రపరుచుకొనుటకు జిప్ ఫైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, హైస్కూల్ సిబ్బంది, గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా గతంలో హైస్కూలుకు బోర్డు, వేదిక, మైక్ సిస్టమ్ ట్రస్ట్ తరపున బహుకరించారు. భవిష్యత్తులో కూడా స్కూల్‌కు ఏ అవసరం వచ్చినా ట్రస్ట్ ఆధ్వర్యంలో మేము చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులందరూ పరీక్షలు బాగా రాయాలని తల్లిదండ్రులు కోర్కెలు తీర్చే విధంగా కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి పరీక్షలు బాగా రాశా విధంగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# వైసీపీ నేత మోయిళ్ల సురేష్ రెడ్డి దౌర్జన్యం చేస్తున్నారు

## వాదనాల రాజేష్ ఆవేదన

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** తాము దళితులమని నెల్లూరు రూరల్ పరిధిలోని జీవిఆర్‌ఆర్ కళాశాల సమీపంలోని కళ్యాణ్ నగర్‌లో తాము 2022లో కొనుగోలు చేసిన స్థలంలోకి వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మోయిళ్ల సురేష్‌రెడ్డి దౌర్జన్యం చేస్తున్నారని వాదనాల రాజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కళ్యాణ్ నగర్‌లోని స్థలం వద్ద శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మొత్తం 62 అంకణాల స్థలానికి సంబంధించి తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయన్నారు. వైసిపి నేత సురేష్ రెడ్డి ఫోన్లు చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి తమకు రాజకీయ బలం ఉందని తమన అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తాము దళితులం కావడంతో పోలీస్ స్టేషన్లకు పిలిపించి రోజంతా నిలబెట్టిస్తున్నారని, సురేష్‌రెడ్డి మూలంగా తాము ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. చింతా రెడ్డిపాలెం నుంచి వైసీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ స్థలం వద్దకు వచ్చి అవాస్తవాలు



మాట్లాడారని, తమది కూడా చింతా రెడ్డిపాలెం మేనన్నారు. వదనాల సల్మా మాట్లాడుతూ.. కళ్యాణ్ నగర్‌లో తమ స్థలానికి సంబంధించి అధికారులు పాలకుల స్పందించి తగిన న్యాయం చేయాలని వైసిపి బెదిరింపుల నుంచి తమను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# పట్టభద్రులకు అప్రెంటీస్‌షిప్ అవకాశం : మెప్మా టీఎంసీ మాధవి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి నేషనల్ అప్రెటీస్‌షిప్ స్కామ్ (ఎన్ఏటిఎస్), నేషనల్ అప్రెంటీస్‌ప్రమోషన్ స్కీమ్(ఎన్ఏపిఎస్) ద్వారా ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్‌కు మెప్మా ఒప్పందం కుదుర్చుకున్నదని మెప్మా టీఎంసీ జి.మాదవి పేర్కొన్నారు. అర్హులైన వారు ఈకార్యక్రమానికి నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఎన్ఏటిఎస్ ద్వారా ఎడాది పాటు నెలకు 4500రూపాయల స్టైఫండ్ లభిస్తుందన్నారు. ఈ ఏడాదికి ఆమొత్తం 54వేల రూపాయలు కాగా సేవా చార్జీలు 1000వంతున ఏడాదికి 12వేల రూపాయలు చెల్లించాలన్నారు. అప్రెంటీస్‌లు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఎంప్లాయబిలిటిస్కీల్స్, ఇంగ్లీష్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌లో 150 గంటల పాటు వర్చువల్ శిక్షణ పొందుతారన్నారు. విజయవంతమైన అభ్యర్థులు ఎన్ఎస్‌డిఎస్, విద్యామంత్రిత్వశాఖ నుండి సర్టిఫికేట్ అందుకుంటారన్నారు. అది వారి ఉద్యోగావకాశాలను పెంచుతుందని పేర్కొన్నారు. 2021 తరువాత రెగ్యులర్ పద్ధతిలో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్మలని, అభ్యర్థులు స్వయంసహాయకసంఘాల కుటుంబాలకు చెందినవారుగా ఉండాలని ఆమె వివరించారు. తగిన డాక్యుమెంట్లతో అర్హులు తమ పేర్లను నమోదుచేసుకోవాలని మాధవి కోరారు.

# అదుపు తప్పి లారీ బోల్తా..



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలం గోలగముడి రోడ్డు సమీపంలో స్పిరిట్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. రాజమండ్రి నుండి క్రషర్ ప్లాంట్‌కు స్పిరిట్‌ను తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్‌లోని స్పిరిట్ మొత్తం రోడ్డుపైకి పరచు కుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# జనసేన ఆవిర్బావ సభను విజయవంతం చేద్దాం : సిద్దు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గ జనసేన నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభకు రెండు బస్సులలో 80మంది జనసైనికులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ.. జనసేన 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత 12సంవత్సరాలనుండి జనసేన పార్టీ నిర్వహించే ప్రతి ఆవిర్భావ సభకు కావలి నియోజకవర్గం నుండి భారీగా తరలి వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కావలి రూరల్ మండల అధ్యక్షులు తిరుపతి స్వామి, బోగోలు మండల ప్రధాన కార్యదర్శి చంటి, చేవూరు నాయబ్, మల్లి కార్జున యాదవ్, సాయి, వహిద్, విష్ణు, ప్రభు, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సర్వసభ్య సమావేశం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మినీ బైపాస్ గెస్ట్ ఇన్‌లో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు దామిని బోయిన వెంకటేశ్వర్లు అధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తాత్కాలిక అధ్యక్షులుగా ఎన్.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా పల్లా శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా యనమల జానకిరామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఆర్టీసీ వెంకటేశ్వర్లు, పులి జగదీష్, కాళ్ళ వెంకటేశ్వర్లు, ఏఈలు గుమ్మడి శ్రీనివాసులు, మన్మధరావు, డీటీ మురళి, శివ, వెటర్నరీ, సుకుమార్, సురేష్ బాబు, కోటేశ్వరరావు, సుంకు వెంకటేశ్వర్లు, గురవయ్య, పవీన్, జేఎల్ ప్రసాద్ జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ మాత్రమే ఉపయోగించుటపై ర్యాలీ

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలో శనివారం ఉదయం 8:00 గంటలకు కొత్త బస్టాండ్ (మలిదేవి కాలువ దగ్గర) నుండి బుచ్చి-చెన్నూరు రోడ్డు మీదుగా డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర అభివృద్ధిలో భాగవగా ఎస్‌యుపి (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) 120 మైక్రన్స్ పైబడిన ప్లాస్టిక్ మాత్రమే ఉపయోగించుట, ప్రమోట్ రియుజబల్స్ పై ర్యాలీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజా, కౌన్సిలర్స్, కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించునని వారు తెలియజేశారు.

# తిరుమలలో ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి







**తిరుమల, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసివున్న కుమారధార తీర్థ ముక్కోటి శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుమారధార తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా తీర్థానికి విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకుల సహకారంతో పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, సాంబారు అన్నం, పెరుగన్నం, పులిహోర, మజ్జిగ, తాగునీరు అందించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రకృతి సౌందర్యాల నడుమ నిర్వహించే కుమారధార తీర్థముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం భక్తులు ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు. కుమారధార సందర్భంగా మార్గంలో చేసిన ఏర్పాట్లను అన్న ప్రసాదం, ఆరోగ్య విభాగం, అటవీశాఖ, విజిలెన్స్, శ్రీవారి సేవ, పోలీసు శాఖ అధికారులు పర్యవేక్షించారు.

**ప్రాశస్త్యం** : వరాహ, మార్కండేయ పురాణాల ప్రకారం ఒక వృద్ధ బ్రాహ్మణుడు శేషాచల గిరుల్లో ఒంటరిగా సంచరిస్తుండేవాడు. శ్రీ వేంకటేశ్వరస్వామివారు ప్రత్యక్షమై 'ఈ వయస్సులో చెవులు వినిపించవు, కళ్లు కనిపించవు.. అడవిలో ఏం చేస్తున్నావు' అని ప్రశ్నించారు. యజ్ఞయాగాలు ఆచరించి దైవరుణం తీర్చుకోవాలనే తలంపుతో ఉన్నాను అని వృద్ధుడు బదులిచ్చాడు. అనంతరం స్వామివారి సూచన మేరకు ఈ తీర్థంలో వృద్ధుడు స్నానమచరించగా 19 ఏళ్ల నవ యువకుడిగా మారిపోయాడు. ముసలి వయసు నుంచి కౌమార్యంలోకి మారిపోవడం వల్ల ఈ తీర్థానికి 'కుమార ధార' అనే పేరు వచ్చింది. పద్మ, వామన పురాణాల ప్రకారం దేవలోక సేనాధిపతి శ్రీ కుమారస్వామి రాక్షసుడైన తారకాసురిని సంహారం తరువాత శాపవిమోచనం కోసం ప్రయత్నించాడు. శివుని సూచన మేరకు శేషాచల పర్వాతాల్లోని వృషాద్రిలో తపస్సు చేశాడు. అనంతరం ఈ తీర్థంలో స్నానమాచరించి శాపవిమోచనం పొందాడు. సాక్షాత్తు కుమారస్వామివారు స్నానం చేయడం వల్ల ఈ తీర్థానికి 'కుమారధార' అనే పేరు స్థిరపడింది.



## శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు



**తిరుమల, మేజర్‌న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం విఐపీ విరామ సమయంలో సుప్రీంకోర్టు న్యాయ మూర్తి ఎస్వీఎన్ బట్టి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తి లక్ష్మణరావు, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్, ఎమ్మెల్యే ఎరుపతినేని శ్రీనివాసరావు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కుప్పం వైస్సార్సీపీ ఎమ్మెల్సీ భరత్, తెలంగాణ బిజెపి ఎమ్మెల్యే రఘునందన్ రావు, ఏపీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సినీ నటి సంయుక్త మీనన్‌లు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.











## తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడ సేవ



**తిరుమల, మేజర్‌న్యూస్ :** తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుమల చినజీయర్ స్వామి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## నేడు నెల్లూరు రూరల్ కావేరి నగర్ సెక్షన్ ఆఫీస్ పరిధిలో విద్యుత్ అంతరాయం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని పోలీసు కాలనీలో కొత్త 11 కేవీ లైన్ ఏరాక్షన్ కారణంగా శనివారం 33/11 కేవీ కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని కావేరి నగర్, రోశయ్య నగర్, బాబా గార్డెన్, అంజనీ లేఅవుట్, టీచర్స్ కాలనీలో ఉదయం 9:00 గంటల నుండి మధ్యానం 2:00 గంటల వరకు పవర్ సప్లయ్‌కీ అంతరాయం కలుగును కావున కరెంట్ వినియోగ దారులు మాకు సహకరించాలని కావేరి నగర్ సెక్షన్ ఏఈ కే.కుమార్ కోరారు.



# సౌత్ మోపూర్‌లో ల్యాబ్ బిల్డింగ్ పనుల శంకుస్థాపన

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో 50లక్షల రూపాయల వ్యయంతో విలేజ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు ల్యాబ్ బిల్డింగ్ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సౌత్ మోపూర్ గ్రామ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఇప్పటికే అనేక గ్రామాలకు వైద్య సేవలు అందిస్తుంది. నాలుగు నెలల్లో ల్యాబ్ బిల్డింగ్ పనులన్నీ పూర్తి చేసి ల్యాబ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సహాయ సహకారాలతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి



పనుల జాతర కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసలు రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, సర్పంచ్ పోలయ్య, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ, మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, టీడీపీ నాయకులు రాపూరు శేఖర్, రవీంద్ర, అరేదుల మణి, మన్నవరం భాస్కర్, తుళ్లూరు రామయ్య, అన్నం సుధాకర్ గౌడ్, పముజుల సతీష్, చీమల సుధాకర్, మన్నవరపు నరసయ్య, సుధాకర్, గుంజి రవి, బీజేపీ నాయకులు పముజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరపాలెం గ్రామంలో రాళ్ల రేవు వద్ద వంతెన నిర్మించాలి




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల 7వ రోజు పర్యటనలలో భాగంగా నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ పర్యటనలో పాల్గొన్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్‌లు మాట్లాడుతూ.. దేవరపాలెం గ్రామంలో రాళ్ళరేవు వద్ద పెద్ద వాగు ఏర్పడి ఉందని దీనికి వంతెన ఏర్పాటు చేసినట్లయితే గ్రామస్తులు తమమాగాణి పొలాల్లోకి వెళ్లేందుకు, స్మశానానికి పోయేందుకు ఎంతో ఉపయోగపడుతుందని కాబట్టి వెంటనే రాళ్లరేవుకు పోయే దారిని జంగిల్ కటింగ్ చేయించి వాగుకు వంతెన ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో తమ ఇళ్ళ ముందు గుంటలు ఏర్పాటు చేసుకొని డ్రైనేజీ వాటర్ ఎత్తిపోసుకుంటున్నారని దీనితో ఏర్పడుతున్న దోమల వల్ల మలేరియా డెంగ్యూ లాంటి విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని కాబట్టి వెంటనే డ్రైనేజీ కాలువలను నిర్మించాలని అన్నారు. నరసింహకొండ ప్రాంతాన్ని కొండ పైన ఉన్న కోనేరులను శుభ్రం చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి నరసింహకొండ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మండల కమిటీ సభ్యులు ఎంవీ రమణ, శ్రీపతి వెంకయ్య, మరిమేసి కామాక్ష య్య, ఎగ్గోలు భాస్కర్, గడ్డం వెంకటేశ్వర్లు, బండి మురళి, కొర్ర పాపయ్య, చిన్న వెంకయ్య, కోటపూడి సుబ్రహ్మణ్యం, పసల వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లిలో రాజకీయ వేడి.. కాకాణిపై టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఫైర్

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయ వేడి మరింత పెరిగింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యతిరేకంగా తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారు, ఆయన వాడుతున్న అసభ్య పదజాలంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాకాణి దళిత భూములను ఆక్రమించాడని, టీడీపీ నేతల ఆస్తులను ధ్వంసం చేశాడని ఆరోపించిన వారు, రాజకీయ కక్ష సాధించినందుకు ఆయనకు ప్రత్యేక డాక్టరేట్ ఇవ్వాల్సిందేనంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. 2014 ఎన్నికల్లో ఓట్ల కోసం గోవా నుంచి కల్తీ మద్యం తెప్పించాడంటూ కొత్త ఆరోపణలు



చేశారు. కాకాణి మాటతీరు మారకపోతే వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళిలా గతి తప్పదని హెచ్చరించారు. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులను గ్రావెల్ కోసం ధ్వంసం చేయడం, జగనన్న కాలనీల్లో అవినీతి జరగడం, టీడీపీ నేతలపై కక్షపూరితంగా కేసులు పెట్టడం, దళితుల భూములు ఆక్రమించడం వంటి విషయంలో ఆయన బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్టానం అసభ్య పదజాలానికి రివార్డు ఇచ్చినట్లు మంత్రి పదవి ఇవ్వడమేనంటూ ఆరోపించారు. ప్రజా స్వామ్యంలో హుందాతనం పాటించాలంటూ సూచించిన వారు, కాకాణి మాటతీరు మార్చుకోకపోతే ప్రజలే బహిష్కరిస్తారని హెచ్చరించారు.



# బంగారు గరుడ వాహనంపై రంగనాథ స్వామి

## అత్యంత వైభవంగా స్వామివారికి పూలంగి సేవ

## మోహినీ అవతారంలో రంగనాథుడు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం ఉదయం రంగనాథ స్వామి మోహిని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ వేడుకకు శివకుమార్ రెడ్డి, సనాతన రెడ్డి ఉదయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం స్వామివారికి పూలంగి సేవ, రాత్రి స్వామి వారికి బంగారు గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. శ్రీ స్వామి వారి పేట ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఉదయకర్తలుగా ఆది కేశవరెడ్డి, నారాయణరెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది ఇంకా ఆలయ అర్చకులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# వైభవంగా గౌరపూర్ణిమి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఇస్కాన్‌లో గౌరీ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గౌరవనీత్యాయ్ అభిషేకాలు కీర్తనలు హారతులు జరిగాయి. ఈ సందర్భంగా నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షులు సుఖదేవ స్వామి మాట్లాడుతూ.. కలియుగంలో హరినామ సంకీర్తన ముక్తికి ఏకైక మార్గం అన్నారు. సాక్షాత్తు భగవంతుడే గౌరవ ప్రభువుగా అవతరించి హరే కృష్ణ మహా మంత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా, ఉద్యమంగా తీసుకువెళ్లి ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక చింతనలో మార్చిన గౌరంగ ప్రభువు ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ సతీమణి ప్రణవ్ గౌతమి అభిషేకాల్లో పాల్గొని అభిషేకాలు చేయడం జరిగిందని తెలిపారు. కీర్తనలు హారతులు ప్రవచనంతో భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు.

# కైలాసం అధ్యక్షతన బీజేపీ మండల సమావేశం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** శుక్రవారం ఇందుకూరుపేట మండలంలోని మండల అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగాభాస్కర్ గౌడ్ విచ్చేసారు. ఈ కార్యక్రమంలో రామలింగయ్య స్వామి, సిహెచ్ గాంధీ, చేవూరు వెంకట్రావు, అవినాష్‌రెడ్డి, రాంమోహన్ రెడ్డి, రఘురాంరెడ్డి, శివప్రసాద్, నెల్లూరు శ్రీనివాసులు, లలిత, కిషోర్, గుమ్మడి పరందామయ్య, శరత్, వెంకటశేషయ్య, మహేష్, రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.